సాక్షి ఏలూరు
బుధవారం। 10। ఏప్రిల్। 2024



నోటా.. తూటా

ఈవీఎంల్లో 2013 నుంచి ఎన్నికల సంఘం నోటాను అమలులోకి తేగా 2014, 2019 ఎన్నికల్లో విస్తృతంగా వినియోగించుకున్నారు. 8లో



రూ.6.21 లక్షలు సీజ్

ఏలూరు జిల్లా చెక్‌పోస్టుల వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.6.21 లక్షల నగదు పట్టుబడ్డారు. అధికారులు నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)
భీమవరం	6.25
ఏలూరు	6.27

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



టీడీపీ, జనసేన నేతల్ని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు

నిడమర్రు: నిడమర్రు గ్రామంలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కీలక నేతలు మంగళవారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు వెంకట సుబ్బరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నిడమర్రు జనసేన పార్టీ మాజీ అధ్యక్షుడు దూసనపూడి శ్రీనివాసరావు, అంబటి బాబులు, మాదాసి రాజు, బేతల శ్రీను, మాదాసు శ్రీను, మాదాసు ఏసు, వడాల రాజకుమార్, వడాల కిషోర్, వెలుగుర్తి వెంకటేశ్వరరావు, కాకర్లమూడి నరేష్ బాబు, మాదాసు రాముడు, గుడి లక్ష్మణరావు, ఉదిసే కుటుంబరావు, వడాల రాజకుమార్, డిడ్ల సురేష్, గంట యాకోబు, యర్ల డేవిడ్, యాండరపు శ్రీరాములు తదితర 50 మంది జనసేన, టీడీపీకి చెందిన కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మాజీ అధ్యక్షుడు దూసనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం తీసుకుంటున్న విప్లవాత్మక మార్పులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరి ఉమా, ఆర్‌బీకే మండల చైర్మన్ పోలిశెట్టి రమేష్, ఎంపీటీసీ దూసనపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారుల ద్వారా సామాజిక చైతన్యం



ఎంఆర్‌వీ సత్యనారాయణ మూర్తికి పుల్లాభొట్ల శ్రీరామమూర్తి పురస్కారం అందచేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కవులు, కళాకారుల ద్వారా సామాజిక చైతన్యం ఏర్పడుతుందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమరావు నేతృత్వంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కవులు, కళాకారులు, సాహిత్యకారులను ఆదరించడానికి ముఖ్యమంత్రి జగన్ కంకణం కట్టుకున్నారన్నారు. సాహిత్య అకాడమీ ద్వారా ఎంతోమంది గొప్పగొప్ప కవులు, కళాకారులతో కలిసే భాగ్యం తనకు కలిగిందని, వారి ద్వారా అనేక విషయాలు నేర్చుకున్నానన్నారు. సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమ రావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు మూడు దశాబ్దాలుగా అనేక కళా ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయా రంగాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. జ్యోతిష, వాస్తు సిద్ధాంతి సముద్రాల వెంకటేశ్వర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం కవి ఎంఆర్‌వీ సత్యనారాయణ మూర్తికి శ్రీ పుల్లాభొట్ల శ్రీరామమూర్తి స్మారక సాహిత్య పురస్కారం, భోగరాజు సత్యనారాయణకు ఆత్మీయ సత్కారం అందచేశారు. అనంతరం కళాకారులు కొలిపాక అరుణ, ఎన్‌వీ గంగాభవాని, మండవ రాజగోపాలకృష్ణ చౌదరి, ఎస్ఎఎంఎస్ హమీద్, జీ. జాహ్నవి లాలిత్యలకు సన్మానం చేశారు.

నిట్‌లో క్రికెట్ లీగ్ ప్రారంభం

తాడేపల్లిగూడెం: ఏపి నిట్‌లో మంగళవారం క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభమైంది. ఈ లీగ్‌లో విద్యార్థులతో పాటు, బోధన, బోధనేతర సిబ్బందితో కలిపి మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటాయి. 12 ఓవర్ల వంతున మ్యాచ్ సాగుతుంది. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబి వీరేషకుమార్, అసోసియేట్ డీన్ కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పటిష్ట నిఘా

ఏలూరు(మెట్రో): ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం, ఉచిత సామాగ్రి పంపిణీ నిరోధించే నిమిత్తం పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇంతవరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.12.45 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. ఇందులో రూ.151.61 లక్షల నగదు కాగా, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.71.53 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజల చెంతకే సుపరిపాలన

- గాంధీజీ గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన జగన్
- సచివాలయాల ఏర్పాటుతో ఇంటికే అన్ని సేవలు
- దరఖాస్తు చేసిన గంటల్లోనే ధ్రువీకరణ పత్రాలు
- ప్రభుత్వ పథకాలన్నీ లబ్ధిదారులకు అందేలా ఏర్పాట్లు



సచివాలయంలో సేవలు పొందడానికి వచ్చిన స్థానిక ప్రజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి.. గ్రామంలోనే ప్రజలకు అన్ని సేవలు అందేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిది. దేశం అభివృద్ధి సాధించాలంటే పేదల అభివృద్ధి ఒక్కటే మార్గమని నమ్మిన ముఖ్యమంత్రి ఆ దిశగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. వాటిని పారదర్శకంగా ప్రజలకు అందేలా సచివాలయ వ్యవస్థ నెలకొల్పి దేశానికి ఆదర్శంగా నిలిచారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించే ఏర్పాటు చేయడంతో సచివాలయ వ్యవస్థ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల మన్ననలు అందుకుంది.

రూ.193 కోట్లతో కొత్త సచివాలయాల నిర్మాణం

ఏలూరు జిల్లాలో గ్రామ, వార్డు స్థాయిల్లో 605 సచివాలయాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా శాశ్వత ప్రాతిపదికన సచివాలయాల నిర్మాణానికి మొత్తం 443 గ్రామాల్ని ఎంపికచేశారు. వీటికి నూతన భవనాల నిర్మాణానికి రూ.193.15 కోట్లు మంజూరు చేశారు. వాటిలో ఇప్పటికే రూ. 120.18 కోట్లతో 284 సచివాలయ భవనాలు పూర్తి చేశారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆ సచివాలయాల్లో 5,682 మంది ఉద్యోగాలు చేస్తున్నారు. వీరు నిరంతరం ప్రజలకు అవసరమైన సేవలు అందించడంతో పాటు, సంక్షేమ పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తున్నారు. వీరితో పాటు లబ్ధిదారులకు వారి గృహాల వద్దే సేవలు అందించడానికి జిల్లా వ్యాప్తంగా 10,284 మంది వలంటీర్లను నియమించారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలకు చెక్

ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళాల్సిందే. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్ళి వీఆర్‌ఓను పట్టుకుని సంతకం చేయించుకోవాలి. అనంతరం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సంతకం, తహసీల్దార్ సంతకం కోసం నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులకు చేతులు తడపాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జగన్ ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేసే ఏర్పాటు చేశారు. నెలల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఎలాంటి సర్టిఫికెట్ అయినా కనిష్ఠంగా గంటల వ్యవధిలో, గరిష్ఠంగా మూడు రోజుల వ్యవధిలో ఇంటి సమీపంలోనే పొందుతున్నారు.

ఎన్ఆర్‌పేట సచివాలయం

పరిధిలో గృహాలు	: 1059
మొత్తం	: 3596 మందికి సేవలు
వలంటీర్లు	: 16 మంది
సచివాలయం పరిధిలో ఆరోగ్య శ్రీ కార్డులు	: 720
రైస్ కార్డులు	: 475
పింఛన్ లబ్ధిదారులు	: 215
వైఎస్సార్ బీమా లబ్ధిదారులు	: 392
చేయూత లబ్ధిదారులు	: 56 మంది
కాపునేస్తం లబ్ధిదారులు	: 28 మంది
జగనన్న తోడు	: 19 మంది

ఇలా మరో 25 పథకాల ద్వారా వందలాది మంది లబ్ధి పొందుతున్నారు.

నాలుగేళ్ళలో ఈ సచివాలయం పరిధిలో రూ. 13.19 కోట్ల లబ్ధి చేకూరింది.

లబ్ధిదారుల్ని గుర్తించి పథకాలు అందేలా చూస్తున్నాం



మా సచివాలయం పరిధిలో వందలాది ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందిస్తున్నాం. ఒక వృద్ధ జంటను పిల్లలు వదిలేశారు. వారిలో ఒకరికి పక్షవాతం రాగా ఆయనకు వికలాంగుల పెన్షన్, ఆయన భార్యకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించి ఆర్థికంగా భరోసా కలిగించాం. వివిధ రకాల పన్నులు మా సిబ్బంది సహకారంతో సులువుగా కట్టే ఏర్పాట్లు చేశాం.

– ఎం.విజయలక్ష్మి, నరసింహారావు పేట సచివాలయం అడ్మిన్

233 మందికి స్థలం రిజిస్ట్రేషన్లు చేయించా



ఈ సచివాలయం వీఆర్‌ఓగా అవసరమైన వారికి సేవలు అందించడం సంతృప్తినిస్తోంది. 233 మంది పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాలను రిజిస్ట్రేషన్ పూర్తి చేసి వారికి సొంతమయ్యేలా ఏర్పాటు చేశాం. నిత్యావసరాలు కొనలేని పరిస్థితిలో ఉన్న సుమారు 50 మంది పేదలకు రేషన్ కార్డులు ఇచ్చి రేషన్ అందే ఏర్పాటు చేశాను. 19 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందే ఏర్పాటు చేశాం.

– మాశెట్టి వకుళాదేవి, వీఆర్‌ఓ, ఎన్ఆర్‌పేట సచివాలయం

రెండు రోజుల్లోనే ఆరోగ్యశ్రీ కార్డు



మా సచివాలయం పరిధిలో ఒక వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి గురవడంతో అత్యవసరంగా వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి. వైద్యానికి డబ్బు లేకపోవడంతో వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి రెండు రోజుల్లో ఆరోగ్య శ్రీ కార్డు మంజూరు చేయించగా, దాని ఆధారంతో ఆయన వైద్యం చేయించుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా తిరుగుతున్నారు. నా సేవలకు సర్టిఫికెట్ అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను.

– వీ. చైతన్య, ఎడ్యుకేషన్ సెక్రటరీ

పెన్షన్లు అందుకున్న వారిలో సంతృప్తి



మా సచివాలయం పరిధిలో అర్హత ఉండి గతంలో వివిధ కారణాలతో పెన్షన్లు అందుకోలేకపోయిన అనేక మంది అర్హులకు పెన్షన్లు మంజూరు చేయించాం. వారు పెన్షన్లు అందుకుంటూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్ని పథకాలు సకాలంలో అందేలా వారి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ సహకరిస్తున్నాం.

– జి. వెంకట రమణమూర్తి, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ

చూసిన కనులదే భాగ్యం

- వేడుకగా శ్రీవారికి ఉగాది ఉత్సవం
- వెండి శేషవాహనంపై తిరువీధి సేవ



ఉగాది మండపంలో పంచాంగ పఠనాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయం నుంచి ఉభయ దేవేరులతో వెండి శేషవాహనంపై ఉగాది మండపం వద్దకు తరలివెళుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఉగాది ఉత్సవం మంగళవారం రాత్రి కనులపండువగా జరిగింది. స్థానిక ఉగాది మండపంలో ఈ వేడుకను అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం నుంచి ఉగాది మండపం వద్దకు వెండి శేష వాహనంపై తరలివచ్చారు. ఉభయ దేవేరులతో శ్రీవారు కొలువైన శేషవాహనం ఉగాది మండపం వద్దకు చేరుకునే సరికి అక్కడున్న భక్తులు స్వామికి నీరాజనాలు సమర్పించారు. అంతకుముందే మండపాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలు, విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు, పండితులు శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని పఠించి, రాశి ఫలాలను చదివి భక్తులకు వినిపించారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. అనంతరం పండిత సత్కారాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ వేడుకలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఆగమ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రలోభాలపై నిఘా నేత్రం

- ఏలూరు రేంజ్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు
- ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ టీంలు
- ఏలూరు రేంజ్‌లో ఇంతవరకూ 8,559 కేసుల నమోదు
- రూ. 20 కోట్ల విలువైన నగదు, బంగారం, చీరలు, మద్యం సీజ్



కలపర్రు టోల్‌ప్లాజా వద్ద భారీగా బంగారం, వెండి వస్తువులను సీజ్ చేసిన అధికారులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏలూరు రేంజ్‌లో పోలీసులు నిఘా మరింత ముమ్మరం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా విస్తృత తనిఖీలు చేస్తున్నారు. వీఐపీ బందోబస్తు వరకు అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. మద్యం, నాటుసారా మొదలుకొని ఎన్నికల తాయిలాల్ని పెద్ద ఎత్తున సీజ్ చేసి వేల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. నాలుగు నెలల వ్యవధిలో 9 కేటగిరిల్లో 8,559 కేసులు నమోదు చేసి 4,755 మందిని అరెస్టు చేసి రూ.20 కోట్లు విలువైన డబ్బు, చీరలు, మద్యం సీజ్ చేశారు.

జిల్లాలో 30 నుంచి 35 టీంలతో తనిఖీ

ఎన్నికల నియామవళి మేరకు ఏలూరు రేంజ్ పరిధిలోని 6 పోలీస్ జిల్లాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేస్తున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, ఒక్కొక్క సర్వేలెన్స్ టీం ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో సగటున 30 నుంచి 35 టీంలు పనిచేస్తున్నాయి. అంతర్ జిల్లాల చెక్‌పోస్టులను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారు. ప్రధానంగా అన్ని రాజకీయ పార్టీల ప్రముఖుల, పార్టీ అధ్యక్షుల విస్తృత పర్యటనలు, బహిరంగ సభలు ఎక్కువ జరుగుతున్న క్రమంలో వీఐపీ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారం వేళ ప్రధాన పార్టీలు ఎదురుపడకుండా ప్రచారం సజావుగా సాగేలా, ఘర్షణలకు తావులేకుండా, స్థానికంగా చర్యలు తీసుకున్నారు.

8,559 కేసులు నమోదు

గతేడాది డిసెంబర్ 26 నుంచి ఏప్రిల్ 7 వరకు రేంజ్ పరిధిలో 8,559 కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా 765 కేసులు నాటుసార విక్రేతలపై నమోదు చేసి 769 మందిని అరెస్టు చేశారు. రూ. 56.58 లక్షల విలువైన 23,116 లీటర్ల సారా సీజ్ చేశారు. 36 కేసులు నమోదు చేసి 1.75 లక్షల లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి తెచ్చిన మద్యానికి సంబంధించి 591 కేసులు నమోదు చేసి 686 మందిని అరెస్టు చేశారు. రూ.33.85 లక్షల విలువైన మద్యాన్ని సీజ్ అలాగే 50 లీటర్ల టెట్రాప్యాకెట్లు సీజ్ చేశారు. పరిమితికి మించి మద్యాన్ని తీసుకువెళ్తున్న సంఘటనకు సంబంధించి 3,174 కేసులు నమోదు చేసి 3,176 మందిని అరెస్టు చేశారు. రూ.63.78 లక్షల విలువైన 11,857 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించి 44 కేసులు నమోదు చేసి 129 మందిని అరెస్టు చేసి రూ.6.91 లక్షల విలువైన నిల్వలు సీజ్ చేశారు.

భారీగా నగదు పట్టివేత

తనిఖీల్లో 3,808 కేసులు నమోదు చేసి రూ.9.55 కోట్ల నగదును సీజ్ చేశారు. 10 కేసుల్లో రూ.7.56 కోట్లు విలువైన బంగారం, వెండిని సీజ్ చేశారు. చీరలు, వాచీలు, ఇతర ఎన్నికల తాయిలాలకు సంబంధించి 131 కేసులు నమోదు చేసి రూ.65 లక్షల విలువైన ఉత్పత్తులు సీజ్ చేశారు. మొత్తంగా 8,559 కేసులు నమోదు చేసి 4,755 మందిని అరెస్టు చేసి రూ.20.41 కోట్లు విలువైన ఉత్పత్తులు సీజ్ చేశారు. 1862 మందిపై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు.

చంద్రబాబు మాయ మాటలు నమ్మొద్దు

ఎన్నికల ప్రచారంలో హోం మంత్రి వనిత



ద్వారకాతిరుమలలో ప్రచారం చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: ఎన్నికలు వచ్చినప్పుడే చంద్రబాబు నాయుడికి ప్రజలు గుర్తుకొస్తారని, ఆయన మాయమాటలు, బూటకపు హామీలు నమ్మి ఎవరూ మోసపోవద్దని హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని ద్వారకాతిరుమల, గుండుగొలనుకుంట, దొరసానిపాడు గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా శ్రీవారి దేవస్థానం హైస్కూల్ వద్ద ఉన్న గణేషుడికి, ఆ తరువాత చినవెంకన్న పాదుకా మండపం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం తూర్పు వీధిలో పర్యటించి, అక్కడి అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. గుడి సెంటర్ నుంచి బైక్ ర్యాలీల నడుమ ప్రచారాన్ని ప్రారంభించారు. మంత్రి వనితకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి, గజమాలలతో సత్కరించారు. వనిత మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడమే కాకుండా, అవినీతి రహిత పాలనను అందించారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. 2014లో చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిలో ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గోపాలపురం ఎమ్మెల్యేగా తనను, రాజమండ్రి ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, యిమ్మడి నాగు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, పానమాల ఉమామహేశ్వరరావు, చిలుకూరి చంద్రం, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చెన్నూరి రామకృష్ణ, అచ్యుత ఏసుబాబు, బొండాడ సాత్యకిరావు, పొంగులేటి నాగేశ్వరరావు, దూలపల్లి ప్రసాద్, కుంటం స్వర్ణలత, రుద్ర శివాజీ, ములకాల పానకాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

మేధా ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచి ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవడం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సును అందిస్తుందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టామని, ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తామన్నారు. ఇంగ్లీష్ మాత్రమే కాకుండా 9 రకాల అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామని. రిజిస్ట్రేషన్ కోసం పైన ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే మొబైల్‌కు లింకు వస్తుందన్నారు. లేదంటే 9866006662 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా మొబైల్‌కు లింకును పంపిస్తామని వివరించారు. రిజిస్ట్రేషన్ ఈ నెల 12 వరకు కొనసాగుతుందన్నారు.

నూజివీడును మరింత అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



ముసునూరు మండలంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌కు హారతులిస్తున్న మహిళలు

ముసునూరు: జగనన్నకు మళ్లీ అధికారం అందించడం ద్వారా నూజివీడు నియోజకవర్గానికి అతి పెద్ద, బహుళ ప్రయోజక పథకాలను సాధించి, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు ఆధ్వర్యంలో కొర్లగుంట, శివారు గ్రామాలు సింహాద్రిపురం, తాళ్లవల్లి, కాట్రేనిపాడు, హరిశ్చంద్రపురం, రంగన్నపాలెంల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు మరోసారి అధికారాన్ని అందించి రాష్ట్రానికి మళ్ళీ ముఖ్యమంత్రిని చేయడం ద్వారా నూజివీడు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపు నిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, 24 గంటలూ అందరికీ అందుబాటులో ఉంటూ, నూజివీడు నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పునరుద్ఘాటించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, మహిళలు భారీగా తరలిరావడంతో గ్రామాల్లోని వీధులన్నీ జనసంద్రంగా మారిపోయాయి. బైక్ ర్యాలీలతో సందడి చేశారు. కార్యక్రమంలో నూజివీడు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కంబాల కృష్ణవేణి, వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపిలు రాజానాయన, గంగాధర్ తాజా మాజీ ఎంపీపి కృష్ణకుమారి, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, సర్పంచ్ ఎస్.సత్యనారాయణ, జిల్లా రైతు సలహా సంఘ నేత పల్లె రవీంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ సొంగా వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయానికి రూ.7.40 లక్షల విగ్రహం

భీమవరం(ప్రకాశంచౌక్) : భీమవరం మావుళ్లమ్మ ఆలయానికి రూ.7.40 లక్షల పంచలోహ విగ్రహాన్ని దాతలు మంగళవారం అందజేశారు. భీమవరానికి చెందిన హారిక పూజ సామాగ్రి యజమాని ఆర్.ఉదయ సూర్య భాను ప్రకాష్, పద్మ దంపతులు అమ్మవారి 280 కేజీల పంచలోహ విగ్రహాన్ని రూపొందించి, అమ్మవారికి అందచేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

క్లుప్తంగా

11న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సమావేశం

ఏలూరు రూరల్: పాలకొల్లు వద్ద అల్లంపర్రు మాంటిసోరి స్కూల్ ఆవరణలో ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా అసోసియేషన్‌ను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా అసోసియేషన్లగా విభజించడంపై సభ్యులు చర్చిస్తారని కోశాధికారి కె.మురళీకృష్ణ వివరించారు.

క్యాంప్‌బెల్ కెనాల్‌కు తాగునీరు విడుదల


క్యాంప్‌బెల్ కెనాల్‌కు విడుదల చేసిన నీరు

ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన క్యాంప్‌బెల్ పంటకాలువకు అధికారులు తాగునీటిని విడుదల చేశారు. దీంతో పలు గ్రామాల్లోని మంచినీటి చెరువులను తాగునీటితో నింపే అవకాశం ఏర్పడింది. మండలంలో మంచినీటి చెరువులు అడుగంటి తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి స్థితిలో ఒక్కసారిగా క్యాంప్‌బెల్ కాలువకు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి అవకాశం ఏర్పడింది. పంచాయతీల కార్యదర్శుల అప్రమత్తమై ఆయిల్ ఇంజన్లతో నీటిని మంచినీటి చెరువులకు లిఫ్ట్ చేసుకోవాలని నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు.

'తపన' ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు


పూజలు చేస్తున్న గారపాటి దంపతులు

ఏలూరు (టూటౌన్): స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని తపన ఫౌండేషన్ కార్యాలయంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, గోపూజ నిర్వహించారు. అనంతరం వేద పఠనం, పంచాంగ శ్రవణం అనంతరం గారపాటి చౌదరి మాట్లాడుతూ తపన ఫౌండేషన్ ప్రారంభించి ఉగాది నాటికి 16 ఏళ్లు పూర్తయిందన్నారు. రాబోయే రోజుల్లో తపన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, చౌటపల్లి విక్రమ కిషోర్, కె.కృష్ణ ప్రసాద్, శరణాల మాలతీరాణి, గుమ్మడి చైతన్య, కొండేపాటి రామకృష్ణ, ఒంటెద్దు యేసు వరప్రసాద్, నడపన దాన భాస్కరరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీలో భగభగలు

- రోజురోజుకూ తీవ్రమవుతున్న వేసవి ఉష్ణోగ్రతలు
- ఎల్‌నినో ప్రభావం వల్లే అంటున్న నిపుణులు
- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు


నిర్మానుష్యంగా మారిన బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రోడ్డు


ఉష్ణోగ్రతల చిత్రం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. ఎల్‌నినో ప్రభావంతో ఇక్కడ ఉష్ణోగ్రతలు సుమారు 41 నుంచి 42 మధ్య నమోదవుతున్నాయి. తీవ్ర ఉష్ణోగ్రతలతో ప్రచండ భానుడి భగభగలు ఏజెన్సీ ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా ఎండతీవ్రత మరీ అధికంగా ఉంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీనివల్ల చిన్నారులు, మహిళలు, వృద్ధులు, రోగనిరోధ శక్తి తగిన మోతాదులో లేని అనారోగ్య తీవ్రత ఉన్నవారు ఎండ నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవి దృష్ట్యా ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో మానవుని శరీరంలోకి సంభవించే ఉష్ణోగ్రతలు తట్టుకోవడం లేదా నియంత్రించే శక్తి విఫలం కావడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సరైన మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం కానీ, తీవ్ర వ్యాయామం లాంటి చురుకైన, శక్తికి మించి పనులు చెయ్యడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. వేడిగాలుల వల్ల వడదెబ్బ (హీట్ స్ట్రోక్) తగిలి శరీరంలో లవణాలు కోల్పోవడం (డీహైడ్రేషన్)తో కలిగే దుష్పరిణామాల వల్ల ఒక్కోసారి పరిస్థితి ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేడి వాతావరణంలో సంచరించే సమయంలో అధిక ఉష్ణోగ్రత ముక్కు, కళ్ల ద్వారా శరీరంలో చేరే అవకాశం ఉంది. దీని వల్ల శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా 106 డిగ్రీల వరకూ ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల చర్మం పొడిబారి ముట్టుకుంటే కాలిపోయే పరిస్థితులు నెలకొంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరంలోని ప్రాథమిక అంతర్గత అవయవాలు సక్రమంగా పని చెయ్యకపోవడం వడదెబ్బకు కారణమవుతాయని వైద్యులు అంటున్నారు. అదే సమయంలో నీరు, రక్త పరిణామాలు తగ్గిపోవడం వల్ల రక్తపోటు కూడా సంభవించే ప్రమాదం ఉందంటున్నారు. వేసవిలో వడదెబ్బకు గురైన వ్యక్తి సత్వరమే ప్రాథమిక చికిత్స తీసుకుని తగిన జాగ్రత్తలు, నివారణ చర్యలు పాటిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బకు గురైతే ఇలా చేయండి



వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దు. ఎవరైనా వడదెబ్బకు గురైతే ఆ వ్యకిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. శరీరం సాధారణ స్థాయి వచ్చే వరకు మెత్తటి తడిగుడ్డతో తుడవాలి. ఉప్పు కలిపిన గ్లూకోజ్‌ను తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితికి వెళ్లిన వ్యక్తికి నీరు తాగించకూడదు. రాబోయే రోజుల్లో ఎండతీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు తీసుకోవాలి. – జె.సురేష్, పీఆర్‌గూడెం ఇన్‌చార్జి డీఎంఓ, కేఆర్‌పురం

మద్ది క్షేత్రం.. భక్తజన సంద్రం


భక్తసంద్రమైన గురవాయిగూడెం మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం మంగళవారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడం, ఉగాది పండుగ కూడా కలిసి రావడంతో వేకువ జామునుంచే క్షేత్రంలో భక్తుల సందడి ప్రారంభమైంది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు ప్రారంభించారు. భక్తులు పంచాగ శ్రవణం కార్యక్రమాన్ని వీక్షించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. రూ.2,25,302 ఆదాయం వచ్చిందని, 2వేల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో చెప్పారు. అలాగే గురవాయిగూడెంలో శ్రీఅయ్యప్పస్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పాలు, వృక్షాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అయ్యప్పకు అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.6.21 లక్షల నగదు సీజ్


విజయరాయి వద్ద తనిఖీల్లో పాల్గొన్న తహసీల్దార్, ఎస్సై బృందం

పెదవేగి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పలు చెక్‌పోస్టుల వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.6.21 లక్షల నగదు పట్టుబడగా, అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మండలంలోని విజయరాయి సమీపంలో బలివే అడ్డరోడ్డు వద్ద ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బి.నరసయ్య వాహనాల తనిఖీలు చేస్తుండగా, అనపర్తి నుంచి ధర్మాజీగూడెం మీదుగా ఏలూరుకు ద్విచక్రవాహనంపై వెళుతున్న చందురెడ్డి, శంకరరావులను ఆపి వాహనాన్ని తనిఖీ చేయగా, ఎటువంటి ఆధారాలు లేని రూ.1.35 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే లింగపాలెం మండలానికి చెందిన పాస్టర్ ఏలియ్య కారులో తరలిస్తున్న రూ.1.50 లక్షలను గుర్తించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ సూర్యప్రభ చెప్పారు. చర్చి విశ్వాసుల నుంచి తీసుకున్న సొమ్ముగా పాస్టర్ ఏలియ్య చెబుతున్నారన్నారు. ఆధారాలు చూపితే నగదు తిరిగి ఇచ్చేస్తామని తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేని రూ.1.21 లక్షల నగదు స్వాధీనం చేసుకుని ఏఆర్‌వో స్లీవజోజికి అందజేశారు. రామనుజపురం నుంచి జంగారెడ్డిగూడెంకు మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఒక వ్యక్తి రూ. 1,21,060 నగదు తీసుకువస్తుండగా గుర్తించామన్నారు. ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఏఆర్‌వోకు అందజేశామని, ఏఆర్‌వో నుంచి సదరు నగదు ట్రెజరీకి పంపినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి కేవీ రమణ చెప్పారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అబ్బులు, మంగరాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు


కామవరపుకోట తనిఖీల్లో పట్టుబడిన సొత్తును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కామవరపుకోటలో..

కామవరపుకోట: కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాల తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు వద్ద నుంచి ఎటువంటి ఆధారాలు లేని రూ. 2.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు మండల ఎన్నికల ఇన్‌చార్జి అధికారి కె.బాబురావు చెప్పారు. రావికంపాడుకు చెందిన ఒక వ్యక్తి రూ.60 వేల నగదు, పాత గండిగూడెం గ్రామానికి చెందిన ఒక మహిళ నుంచి రూ.1.55 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఏఎస్‌ఐ పీవీ స్వామికి అందజేసినట్లు బాబురావు తెలిపారు. తగిన ఆధారాలు చూపించినట్లయితే ఏలూరు ఎన్నికల ట్రెజరీ కార్యాలయంలో ఈ నగదును వెనక్కి ఇవ్వటానికి 24 గంటలు అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. వాహనాల తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ కె.రమేష్, కానిస్టేబుల్స్ కె.రామకృష్ణ, ఎం.నాగార్జున, షేక్. నాగూర్ సాయి పాల్గొన్నారు.

వాడుకుని వదిలేయడంలో చంద్రబాబు దిట్ట


చెక్కపల్లిలో ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన

ముసునూరు: వాడుకుని వదిలేయడం, నమ్మినవారిని వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు దిట్ట అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రెబల్ అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని చెక్కపల్లి, లోపూడి, గుళ్లపూడి, వలసపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 నుంచి నూజివీడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేసి తనకే నూజివీడు ఎమ్మెల్యే సీటు అని ప్రకటించిన చంద్రబాబు, తరువాత ప్లేటు ఫిరాయించి, వైఎస్సార్ సీపీలో ఉన్న వ్యక్తికి కండువా కూడా కప్పకుండానే టికెట్ ప్రకటించడాన్ని దుయ్యబట్టారు. సొంత మామ ఎన్టీఆర్‌కు, సొంత బావమరిది హరికృష్ణకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, వేరెవరికైనా ఈజీగా వెన్నుపోటు పొడవగలడన్నారు. చంద్రబాబు వెన్నుపోటు బాధితుల జాబితా రోజురోజుకూ కొండవీటి చాంతాడులా పెరిగి పోతుందన్నారు. ముద్దరబోయిన, గోపాల్ యాదవ్, మాగంటి బాబు, ఇంకా అనేక మంది చంద్రబాబు బాధితులుగా మారిపోయారన్నారు. కొలుసు పార్థసారథికి నూజివీడు సీటు ఇవ్వడం కూడా వంగనామాలు పెట్టడానికే అని ఎద్దేవా చేశారు.

శ్రీవారి క్షేత్రంలో చింతమనేని చిందులు

- కార్లకు టోల్‌గేట్ చెల్లించకుండా సిబ్బందిని బెదిరించిన వైనం
- బ్యారికేడ్‌లను పక్కకు నెట్టి దురుసుగా క్షేత్రంలోకి ప్రవేశం

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన దేవస్థానం టోల్‌గేట్ సిబ్బందిపై దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకరరావు మంగళవారం చిందులు తొక్కారు. అంతటితో ఆగకుండా అక్కడున్న బారిగేట్‌ను పక్కకు నెట్టి, సిబ్బందిని బెదిరించి మరీ వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.. శ్రీవారి దర్శనార్థం ఉదయం చింతమనేని ప్రభాకరరావు తన భార్యతో పాటు మరో ఇద్దరితో కలిసి రెండు కార్లలో క్షేత్రానికి విచ్చేశారు. అయితే టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి వారి కార్లకు ముందు భక్తుల కార్లు ఉన్నాయి. నిమిషం కూడా ఆగకుండా వీఐపీలు వెళ్లే మార్గంలోంచి వెళ్లేందుకు ప్రయత్నించారు. బ్యారికేడ్ అడ్డు రావడంతో అక్కడ ఆగిన చింతమనేనికి ఇటుగా వెళ్లకూడదని సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో చింతమనేని వెంటనే కారు దిగి బ్యారికేడ్‌ను పక్కకు నెట్టి, టోల్‌గేట్, సెక్యూరిటీ సిబ్బందిపై రుసరుసలాడారు. మీ సంగతి తరువాత చూస్తానంటూ బెదిరించి టోల్ రుసుము చెల్లించకుండా కొండపైకి వెళ్లారు. టోల్‌గేట్ సిబ్బందిపై చింతమనేని గొడవపడిన సమయంలో అక్కడున్న వారంతా ముక్కున వేలేసుకున్నారు. మరీ ఇంత దారుణమా అని నోరువెళ్లబుచ్చారు. టోల్‌గేట్, సెక్యూరిటీ సిబ్బంది సైతం ఏం చేయాలో పాలుపోక అలా చూస్తూ ఉండిపోయారు.

కుంకుళ్లమ్మకు లక్ష గాజుల అలంకరణ


కుంకుళ్లమ్మకు కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 17 వరకు ఈ ఉత్సవాలు జరగనుండగా, అమ్మవారికి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలతో పాటు, గాజుల అలంకరణ చేయనున్నారు. ఈ అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శిస్తే మహిళలు నిండు సౌభాగ్యవతులుగా ఉంటారని పండితులు చెబుతున్నారు. – ద్వారకాతిరుమల

నోటా.. తూటా

- ఏలూరు జిల్లాలో నోటాకు పెరుగుతున్న ఓట్లు
- 2019 ఎన్నికల్లో నోటా ఖాతాలో 19,648 ఓట్లు
- చాలా చోట్ల జాతీయ పార్టీల అభ్యర్థుల కంటే ఆధిక్యం



నూజివీడు: 'నన్ ఆఫ్ ది ఎబౌవ్'కు సంక్షిప్త రూపమే నోటా. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు నచ్చకపోతే ఓటరు తన ఓటు వేయడానికి ఆసక్తి చూపడు. దీంతో ఆ ప్రభావం ఓటింగ్ శాతంపై పడుతుందని గుర్తించిన ఎన్నికల సంఘం నోటా మీటను అమలులోకి తీసుకువచ్చింది. 2013 నుంచి నోటా అమలులోకి రాగా 2014, 2019 ఎన్నికల్లో ఓటర్లు దీనిని విస్తృతంగా వినియోగించుకున్నారు. ఈవీఎంపై పోటీలో ఉన్న అభ్యర్థుల పార్టీ గుర్తులతో పాటు అన్నింటికన్నా కింద నోటా మీట కూడా ఓటర్లకు అందుబాటులో ఉంటుంది. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేయకూడదనుకుంటే నోటాకు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. నోటా బటన్ నొక్కితే ఏ అభ్యర్థికి ఓటు పడదు. కానీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నట్లు గానే ఎన్నికల సంఘం పరిగణిస్తుంది. ఈ క్రమంలో నోటాకు రానురాను ఓట్లు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. 2019 ఎన్నికల్లో ఏలూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి నోటాకు 19,648 ఓట్లు వచ్చాయి. కొన్ని నియోజకవర్గాల్లో అప్పట్లో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కంటే నోటాకే ఎక్కువ ఓట్లు పడటం గమనార్హం.

2019 ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్ల వివరాలు

- నూజివీడు నియోజకవర్గంలో నోటాకు 2,247 ఓట్లు వచ్చాయి. ఇది మొత్తం ఓట్ల శాతంలో 1.12 శాతం. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకంటే నోటాకు ఎక్కువ ఓట్లు పడ్డాయి. మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేయగా 8 మంది నోటా కంటే తక్కువ పోలయ్యాయి.
- ఏలూరు నియోజకవర్గంలో నోటాకు 1,524 ఓట్లు రాగా, ఇక్కడ కూడా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నోటా కంటే వెనకబడి ఉన్నారు. మొత్తం 9 మంది అభ్యర్థులుండగా నోటా కన్నా ఐదుగురు అభ్యర్థులు వెనుకబడి ఉన్నారు. ఇక్కడ మొత్తం ఓట్ల శాతంలో 0.9 శాతం నోటాకు పోలయ్యాయి.
- చింతలపూడి నియోజకవర్గంలో నోటాకు 3,477 ఓట్లు రాగా, ఇది మొత్తం ఓట్ల శాతంలో 1.6 శాతం ఉంది. బీజేపీ కన్నా నోటాకు ఇక్కడ ఎక్కువ ఓట్లు వచ్చాయి. మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా ఆరుగురు అభ్యర్థులు నోటా కంటే వెనుకబడ్డారు.
- పోలవరం నియోజకవర్గంలో నోటాకు 6,004 ఓట్లు పోలవ్వగా, మొత్తం ఓట్ల శాతంలో 2.81 శాతంగా ఉంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి నోటా కంటే ఎక్కువ వచ్చినప్పటికీ బీజేపీ అభ్యర్థికి మాత్రం తక్కువ వచ్చాయి. మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేయగా ఏడుగురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- దెందులూరు నియోజకవర్గంలో నోటాకు 2,546 ఓట్లు రాగా, మొత్తం ఓట్ల శాతంలో 1.36 శాతంగా ఉంది. ఇక్కడ కూడా జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు నోటా కంటే వెనుబడి ఉన్నాయి. ఇక్కడ నుంచి మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా తొమ్మిది మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- ఉంగుటూరు నియోజకవర్గంలో నోటాకు 2,321 ఓట్లు రాగా, మొత్తం ఓట్ల శాతంలో ఇది 1.33 శాతం. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నోటా కంటే వెనుకబడి ఉండగా, మొత్తం 9 మంది పోటీ చేయగా నలుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- కైకలూరు నియోజకవర్గంలో నోటాకు 1,529 ఓట్లు రాగా, మొత్తం ఓట్ల శాతంలో ఒక శాతం నోటాకు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి నోటా కంటే తక్కువ ఓట్లు రాగా, మొత్తం 15 మంది పోటీ చేయగా 10 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు పడ్డాయి.

దళితులను ఓటడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది


మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: దళితులకోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దళితులను ఓట్లు అడిగే హక్కు ఉందని, దళితుల ఆరాధ్యదైవం డా.బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడలలో నడుస్తున్న వైఎస్ జగన్‌కు దళితులంతా అండగా ఉంటారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళవారం గణపవరంలో జరిగిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తిరగరాస్తామని ప్రకటించిన బీజేపీకి మందకృష్ణమాదిగ మద్దతు ప్రకటించడం దారుణమని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే దళితుల అణచివేత తప్పదన్నారు. అవ్వాతాతలకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు విషం కక్కుతున్నారన్నారు. వలంటీర్లలో అధికులు దళిత యువతేనని, వారి ఉపాధికి గండి కొడుతున్న టీడీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికలలో కూటమిని ఓడించి, మళ్లీ సంక్షేమ పాలకుడు వైఎస్ జగన్‌ను అధికారంలోకి తీసుకురావడానికి పేదలంతా కంకణబద్ధులు కావాలని ఆయన కోరారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు టి.శివ, సందీప్, రామారావు, సునీల్ పాల్గొన్నారు.

భారీగా మద్యం స్వాధీనం


అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద మద్యం బాటిళ్ల కేసులను స్వాధీనం చేసుకున్న అధికారులు

చింతలపూడి: అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఎస్ఎస్‌టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 3,546 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. ఏలూరు ఎంఆర్‌సీ గోడౌన్ నుంచి సీతానగరం ప్రభుత్వ మద్యం దుకాణానికి తరలిస్తున్నట్లు డ్రైవర్ చెప్పాడని, అయితే పర్మిట్ అడ్రస్ సీతానగరం కాకుండా చింతలపూడి అని ఉండటంతో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సెబ్ అధికారులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ.26 లక్షలు ఉంటుందని చెప్పారు.